# ఏది నీ గమ్యం?

ఇది నిజమేనా? సోఫాలో నిస్తేజంగా వెనక్కి వాలిపోయి, స్థాణువులా కూర్చుండిపోయింది కృష్ణవేణి. ఇది నిజమేనా? తను కలగంటోందా? ఆమె చేతిలో ఉన్న కాగితం ఫ్యాన్ గాలికి రెపరెపలాడుతోంది. ఏమాత్రం ఆమె చేతి బిగువు సడలినా ఎగిరిపోడానికి సిద్ధంగా ఉంది. కృష్ణవేణి గాజుకళ్లతో ఆ కాగితం వైపు చూసింది. స్వేచ్ఛగా ఎగిరిపోతూ లాలిత్య ఊపుతోన్న చేయిలా కనిపించింది ఆ కాగితం. ఒక్కసారిగా ఉలిక్కిపడింది. 'నో... అలా జరక్కూడదు' గట్టిగా అరిచాననుకుంది. కానీ గొంతు పెగిలి ఒక్క అక్షరం కూడా బైటికి రాలేదు. జరక్కూడదేంటి... రెక్కలొచ్చిన చిన్నారి చిలక లేత రెక్కలు విదిలించి వెళ్లిపోయింది. తానిప్పుడు పరిపూర్ణమైన స్త్రీనని గుర్తు చేస్తూ అక్షరాల అక్షింతలు చల్లుతోంది.

ఎలా పెంచింది లాలిత్యని!... పుట్టినప్పటి నుంచి కళ్లల్లో పెట్టుకుని పెంచింది. నేలమీద కాలు పెడితే కందిపోతుందేమో అని అరచేతుల మీద నడిపించింది. చిన్నప్పటి నుంచి లీలావతి గర్భంలో ఉండగానే నారదుడు ప్రహ్లాదుడి కి హరినామ సంకీర్తనం నేర్పినట్టు పసిపిల్లగా ఉన్నప్పటినుంచీ వ్యక్తిత్వ వికాస పాఠాలను జోల పాటలుగా పాడింది. స్వేచ్ఛ, స్వాతంత్ర్యాల మీద బెడ్ టైమ్ స్టోరీస్ చెప్పింది. స్త్రీ కేవలం వంటింటికి పరిమితం కాదని, సమాజ ప్రగతి రథానికి స్త్రీ కూడా ఒక చక్రం అనీ, ఎప్పుడూ ఆ చక్రం కుంటుపడకుండా బతకడం నేర్పింది. కానీ, కానీ... ఇదేంటి ఇలా ఎలా జరిగింది? ఎప్పుడూ ఏ విషయంలోనూ నాన్న ఉంటే ఇలా చేసేవాడా? అనే మాట తన నోటి నుంచి రాకూడదని ఎంతో తపన పడింది. తన వ్యాపకాలతో, తన ఉద్యోగ బాధ్యతలతో తీరికలేక లాలిత్యని స్కూలుకి తీసుకువెళ్లి, తీసుకురావడానికి కారు కొని, డ్రైవర్‌ని పెట్టింది. తను బస్సులో వెళుతూ లాలిత్యని కారులో తిప్పింది. యవ్వనంలో అడుగుపెడుతోందన్న విషయం తెలిసిన దగ్గర్నించి, పొంచి ఉండి సమయం చిక్కగానే కాటేసే తోడేళ్ల గురించి, పాముల గురించి నూరిపోసింది. ధైర్యం, సాహసం, పట్టుదల, కృషి ఇవే జీవితంలో ఉన్నతస్థానంలో నిలవడానికి

అవసరమయ్యే నాలుగు స్థంభాలని ఎన్నోసార్లు జీవిత పాఠాలు చెప్పింది. ఈ ధైర్యం తను నూరిపోసినందుకేనా? ఎన్నడూ ఎవరికీ, దేనికీ తలొంచొద్దు, ఎవరినీ దేనికీ దేబిరించద్దు. ధీమాగా, దర్జాగా బతకాలి అని చిన్నప్పటి నుంచీ ఉగ్గుపాలతో నూరిపోసినందుకేనా 'నీవు నేర్పిన విద్యయే నీరజాక్షీ' అని వెక్కిరిస్తూ వెళ్ళి పోయింది.

ప్రేమించిన శశిని పెళ్లి చేసుకుంటానంటే ముందు కాదన్నా తరవాత తన చేతుల మీదుగా పెళ్లి చేసింది. "చదువాపకే తల్లీ పోస్ట్‌గ్రాడ్యుయేషన్ చేయి, నాలాగా 'వివాహం విద్యానాశాయ' అనే నానుడి నిజం చేయకు" అని నచ్చచెప్పి కాపురానికి పంపించింది. శశికి బెంగుళూరులో ఉద్యోగం... సాఫ్ట్‌వేర్... ఇంజనీరు... బియస్సీ కంప్యూటర్ సైన్స్ చేసిన లాలిత్యకి అతను కొంతకాలం లెక్చరర్‌గా ఉన్నాడు. ఆ తరవాత అతనికి మంచి ఉద్యోగం వచ్చింది. అతని ఉద్యోగం రావడం, బియస్సీ పూర్తి చేయడం ఒకేసారి జరిగాయి.

ఒకానొక ఉదయం 'శశిని పెళ్లి చేసుకోవాలనుకుంటున్నాను' అని చెప్పిన లాలిత్య వైపు నిర్ఘాంతపోయి చూసింది. ఇంకా తన చేతుల్లో బుడి, బుడి అడుగులు వేస్తున్న లాలిత్యే కనిపించి హతాశురాలైంది. కనీసం 'నీ అభిప్రాయం ఏంటమ్మా' అని కూడా అడక్కుండా తన నిర్ణయం చెప్పింది. ఆమెకేం చేయాలో అర్థం కాలేదు.

ఆ తరవాత గోపాల్ దగ్గర్నించి రికమండేషన్ తెచ్చింది పెళ్ళికి అంగీకరించమని. అప్పుడుకానీ అర్థంకాలేదు.. తండ్రీ కూతుళ్లు తనకి తెలియకుండా కలుస్తూనే ఉన్నారని, తండ్రితో అనుబంధం వదులుకోలేదని, పుట్టినరోజు కానుకలు, పండగలకి కొత్తబట్టలు చూపించి ఫ్రెండ్స్ ఇచ్చారంటే నమ్మింది.

ఎప్పుడైతే గోపాల్ లాలిత్య పెళ్లి విషయంలో కలగచేసుకున్నాడో అప్పుడు తనమీద తనకే జాలేసింది. తనకి తెలియకుండా ఏదో జరుగుతోందన్న విషయం గ్రహించి అవమానంగా భావించింది. కానీ, లాలిత్య కోసం కొంత, సమాజం కోసం కొంతా తనని సంసిద్ధం చేసుకుని పెళ్లికి అంగీకరించింది. కన్యాదానం చేయడానికి పీటల మీద ఎట్టి పరిస్థితుల్లో గోపాల్ పక్కన కూర్చోడానికి ఒప్పుకోక పోవడంతో రిజిస్ట్రార్ ఆఫీసులో పెళ్లి చేసి మంచి హోటల్‌లో రిసెప్షన్ ఏర్పాటు చేశాడు గోపాల్.

ఆ రిసెప్షన్‌కి తాను ఒక గెస్ట్‌గానే వెళ్లింది. గోపాల్, అతని అక్కచెల్లెళ్లు కూడా కుటుంబాలతో వచ్చారు. వాళ్లమ్మా, నాన్న చనిపోవడానికి తానే కారణం

అని శాపనార్థాలు పెట్టారు. మరి నా తల్లితండ్రి చనిపోడానికి ఎవరు కారణం అని అడగాలనుకుంది. కానీ ఎవరితో ఏమీ మాట్లాడకుండా ఆవేశం, ఆవేదన అణచుకుని కార్యక్రమం జయప్రదంగా జరగడానికి నోరుమూసుకుంది.

శశితో కాపురానికి లాలిత్య బెంగుళూరు వెళ్లే రోజున తన ఆవేదనంతా వెళ్లగక్కింది. "పెళ్లితో ఆడది ఏం పోగొట్టుకుంటుందో, ఆ పోగొట్టుకున్నది పొందడానికి తిరిగి ఎంత మానసిక వేదన పడాలో, ఎంత సంఘర్షణ పడాలో లాలిత్యకు చెప్పింది.

"ముందునుంచే జాగ్రత్తగా ఉండి, నీ అస్తిత్వం కాపాడుకో" అని బోధించింది. అన్నిటికీ లాలిత్య మౌనంగా ఊకొట్టింది.

కానీ, చిత్రంగా లాలిత్య తానంతట తానే చదువు మానేసింది. "ఎందుకమ్మా, నేను ఉద్యోగం చేయాల్సిన అవసరం ఏం ఉంది? శశికి లక్ష దాకా వస్తోంది నెలకి" అంది, మొదట్లో కూతురు కాపురం ఎలా ఉందో చూడడానికి వెళ్లినపుడు.

శశికి అదిష్టం, శశికి ఇదిష్టం, శశి అలా అన్నాడు. శశి ఇలా అన్నాడు. శశి నామస్మరణతో విసిగించేసింది. ఆ రోజే కృష్ణవేణి లాలిత్యని బాగా మందలించింది. "పెళ్ళైన కొత్తలో అలాగే ఉంటుంది. భర్తే లోకంలా... కానీ రోజులు గడుస్తుంటే నీ పర్సనల్ లైఫ్ గుర్తొస్తుంది. అప్పుడు అర్థమవుతుంది. ఏం కోల్పోయావో" అంటూ స్త్రీకి ఆర్థిక స్వాతంత్ర్యం ఎంత అవసరమో చెప్పింది. అన్నిటికన్నా కృష్ణవేణి ఆశ్చర్యానికి గురి చేసిన విషయం శశి తల్లితండ్రులు తరచూ ఢిల్లీ వెళ్లి నెలల తరబడి అక్కడే ఉండడం, వాళ్లకి సేవ చేయడంలోనే తన జీవితం ధన్యం అయినట్టు భావిస్తూ వాళ్ల సేవల్లో లాలిత్య సర్వం మరిచిపోవడం కృష్ణవేణికి అర్థంకాలేదు.

కొంతకాలం చెప్పినా లాలిత్య మారకపోగా, "నాకిలాగే ఇష్టం మమ్మీ. నన్నిలాగే ఉండనీ... చిన్నపిల్లను కాదుగా, లెట్ మీ హావ్‌మై ఓన్ లైఫ్ స్టైల్ అనడంతో హతాశురాలైంది. ఆ తరవాత చెప్పడం మానేసింది.

ఇప్పుడు అదే కృష్ణవేణి, ఆంధ్రదేశంలో సుప్రసిద్ధ రచయిత్రిగా పేరు ప్రఖ్యాతులున్న కృష్ణవేణి, స్త్రీ స్వాతంత్ర్యం గురించి స్త్రీల హక్కుల గురించి వేదికల మీద ఉపన్యాసాలిస్తూ, స్త్రీవాదిగా, స్త్రీల హక్కుల ఉద్యమకారిణిగా కీర్తించిన కృష్ణవేణి, తన స్వేచ్ఛ కోసం, తన స్వాతంత్ర్యం కోసం భర్తతోసహా ఎవర్నీ లెక్కచేయని కృష్ణవేణి, వ్యక్తిత్వం నింపిన వికాసంతో ఎప్పుడూ నిర్లక్ష్యంగా, ఠీవిగా తిరిగే

కృష్ణవేణి రెక్కలు తెగిన పక్షిలా, కుప్పకూలిపోయింది.

కృష్ణవేణి కళ్లనుంచి నీళ్లు చుక్కలుగా రాలిపోతూ ఆమె కట్టుకున్న చీరని తడుపుతున్నాయి.

ఆమె కళ్ల ముందు గడచిన జీవితం అంతా సినిమా రీలులా తిరగడం ప్రారంభించింది.

సుమారు పాతికేళ్ళ క్రితం కృష్ణవేణి ఎం.ఏ తెలుగు లిటరేచర్ చదువుతున్న రోజుల్లో, క్లాస్‌మేట్ గోపాల్ మంచి స్నేహితుడు. తను రాసే కవితలను, కథలను ఎప్పటికప్పుడు చదువుతూ ఆ సబ్జెక్ట్ మీద చర్చిస్తుండేవాడు. ఏదన్నా నచ్చని అంశం ఉంటే... నిర్మొహమాటంగా విమర్శించేవాడు. అప్పటికే కృష్ణవేణి రచయిత్రి గా ఒక స్థానం సంపాదించుకుంది. మంచి స్త్రీవాద కవయిత్రిగా, కథకురాలిగా పేరుంది. కొంచెం రాసినా ఆ రాసినవి అర్థవంతంగా, ఒక స్థాయిలో ఉండడంతో ఆమెని దాదాపు కాలేజీలో లెక్చరర్లు, స్టూడెంట్స్, అభిమానించే వాళ్లు. వాళ్లందరిలో గోపాల్‌లో కొద్దో, గొప్పో సాహితీ పిపాస ఉండడంతో అతను ఒక క్లాస్‌మేట్‌గా కాక, మంచి స్నేహితుడుగా ఆమె జీవితంలో ప్రముఖ స్థానాన్ని ఆక్రమించాడు. సాహితీపరంగానేకాక, సబ్జెక్ట్ పరమైన చర్చలతో కూడా వాళ్ల మధ్య కాలం మంచులా కరిగిపోతుండేది. ఎం.ఏ పూర్తయింది. ఓ పక్క ఎంఫిల్ చేస్తూ చిన్నదైనా లెక్చరర్ ఉద్యోగం వెతుక్కోవాలన్నది తన భవిష్యత్తు ప్రణాళికగా చెప్పింది కృష్ణవేణి.

ఆరోజు రిజల్ట్ వచ్చిన రోజు ఇద్దరూ చల్లని ఐస్‌క్రీమ్ తింటూ ట్యాంక్‌బండ్ దగ్గర కూర్చున్నారు. వేసవి కాలం వెళ్లిపోతూ చల్లదనాన్ని సృష్టికి పంచుతున్న సమయం. వాళ్లలాగే ఆహ్లాదకరమైన ఆ వాతావరణాన్ని ఆనందించడానికి మరి కొందరు జంటలతో, పిల్లా, పాపలతో, ఐస్‌క్రీమ్‌లు, బూరలు అమ్ముతున్న చిన్న చిన్న వ్యాపారస్థులతో కళకళలాడుతోంది. ఆ సమయంలో తన భవిష్యత్తు ప్రణాళిక గురించి గోపాల్‌తో చెప్పి, “నీ ప్లాన్ ఏంటి” అని అడిగింది కృష్ణవేణి. “ఉద్యోగం వెతుక్కుంటాను. నాకింకా చదివే ఓపిక, ఆసక్తి రెండూ లేవు” అన్నాడు.

“అదేంటి గోపాల్. పిహెచ్‌డి చేయందే మనకి మంచి ఉద్యోగాలు ఎలా వస్తాయి? మంచి ప్రొఫెసర్స్‌గా నిలబడాలంటే పిహెచ్‌డి చేయాలి. నా మాట విను. నువ్వు కూడా ఎంఫిల్‌కి అప్లై చేయి” అంది.

గోపాల్ కొన్ని క్షణాలు మౌనంగా హుస్సేన్‌సాగర్‌లో మెల్లమెల్లగా కదులుతున్న నీటి అలలు చూస్తూ అన్నాడు. “నువ్వు నాకు తోడుగా జీవితాంతం ఉంటానని మాటిస్తే చేస్తాను.”

కృష్ణవేణి ఊహించని ప్రస్తావన రావడంతో ముందు కొంచెం షాక్ అయింది. తరవాత ఆలోచనలో పడింది. ఇంతకాలం కేవలం స్నేహితులమే అనుకున్నా, అతనలా చెప్పాక ఆమె మొదటిసారిగా అతడిలో ప్రియుడిని, ఆ తరువాత జీవిత భాగస్వామిని ఊహించుకుంది. నెమ్మదిగా సూర్యుడు అస్తమిస్తు న్నాడు. లేత నారింజరంగు పులిమినట్టు ఆకాశం అందంగా ఉంది. నీళ్ల మీద పడుతున్న ఆ కిరణాలు వింత అందాన్ని సంతరించుకున్నాయి. చిన్న పాప బెలూనుతో మైమరిచి ఆడుకొంటోంది. కృష్ణవేణి గోపాల్ వైపు చూసింది. ఒక్క క్షణం ఇద్దరి కళ్లు కలుసుకున్నాయి. ఇంతకాలం కలగని భావనేదో ఆమెలో కలిగింది. సన్నటి పులకింత నిలువెల్లా పాకింది. 'విప్లవ కుమారి' అని పిలిపించు కున్న కృష్ణవేణి కళ్లు మొదటిసారిగా సిగ్గుతో వాలిపోయాయి. ఆమె మొహంలో... కలుగుతోన్న భావాలు గోపాల్‌లో ఉత్సాహాన్ని కలిగించాయి.

"సో నీకిష్టమే కదా" అడిగాడు మధురంగా.

తల ఊపింది. పెళ్లి అనే తంతు, సన్నాయి వాయిద్యం, పూలరేకుల వర్షం. భవిష్యత్తు ఎంతో అందంగా, ఆహ్లాదంగా కనిపించింది. కాదనడానికి కారణం ఏమీ కనిపించలేదు. గోపాల్ తనకి బాగా తెలుసు. మంచివాడు. సంస్కారవంతుడు. తన భావాలు, మనస్తత్వం, ఆశయాలు బాగా ఎరిగినవాడు.

ఆ తరవాత సరిగ్గా రెండు నెలల్లో ఇరుపక్షాల పెద్దల ఆశీర్వాదంతో పెళ్లి అంతా కలలోలా జరిగింది. కొంతకాలం జీవితం పరిమళభరితంగా, మంచి కావ్యంలా, మధురంగా సాగిపోయింది. ఇద్దరికీ ప్రైవేటు కాలేజీల్లో విడివిడిగా లెక్చరర్ ఉద్యోగాలు దొరికాయి. ఆషాడమాసపు అభ్యంతరాలు, అధికమాసం నిబంధనలు అన్నీ అయాక అత్తగారింటికి బయలుదేరింది కృష్ణవేణి. అప్పటిదాకా పెళ్లంటే తానూ, గోపాలే అనుకున్న కృష్ణవేణికి హఠాత్తుగా గోపాల్‌తోపాటు మరికొంతమందికి తనమీద అజమాయిషీ హక్కులు కలిగాయని తెలుసుకుంది. అలా ఎలా? పద్దెనిమిదేళ్లు దాటగానే అమ్మా, నాన్నే తనని స్వతంత్రంగా వదిలే శారు. అన్నిటిలో స్వయం నిర్ణయాలే తీసుకుంది. అలాంటిది పెళ్లయ్యాక, తాను ఒక గృహిణిగా మారాక తనమీద మరొకరు పెత్తనం చేస్తుంటే భరించ లేక పోయింది.

విశాలమైన ఆ ఇంట్లో ఆరు గదులు, వసారా, బైట పెరడు, ముందు పూలమొక్కల మధ్య సన్నటి దారి, ఎత్తైన అరుగులు, సింహద్వారం. అలాంటి ఇంట్లో తనకి ముందుగా వంటగది అప్పగించింది అత్తగారు. ఉదయాన్నే లేచి

పాలు కాచి, కాఫీలు ఇవ్వడం, టిఫిన్లు, వంట ఇదంతా పూర్తి చేసుకుని తనకి, గోపాల్‌కి బాక్స్ సర్దుకుని కాలేజీకి వెళ్లాలంటే బ్రేక్‌ఫాస్ట్ చేయడానికి టైం సరిపోయేది కాదు.

ఓరోజు గోపాల్‌తో అంది "ఇదేంటి గోపాల్ బొత్తిగా నేను వచ్చిన దగ్గర్నించీ మీ చెల్లెలసలు వంటగదిలోకి రావడంలేదు. మీ అమ్మగారు అసలే రావడంలేదు. ఇంత పని చేసి కాలేజీకి వెళ్ళేటప్పటికి ఆల్‌మోస్ట్ లేట్ అవుతోంది.

గోపాల్ నిస్సహాయంగా అన్నాడు, "ఇది ఆడవాళ్ల విషయం కృష్ణా... నేను కల్పించుకుంటే బాగుండదు. ఇంకా కొంచెం పెందలాడే లే పోనీ."

"ఇంకా పెందలాడేనా!" ఇప్పటికే ఐదింటికల్లా లేస్తోంది. ఇంకా పెందలాడే అంటే, విపరీతమైన కోపం వచ్చింది అతని మీద. బలవంతంగా అణచుకుంది. నిజమే, ఈ సమస్య తనే పరిష్కరించుకోవాలి అనుకుంది.

మర్నాడు యధావిధిగా కాఫీలు ఇచ్చేసి నేరుగా వంట చేసింది. టిఫిన్లు చేయలేదు.

ఎనిమిది అవగానే టిఫిను, టిఫిను అంటూ ఇంటిల్లిపాదీ అల్లాడిపోయారు. గోపాల్ జడవేసుకుంటోన్న కృష్ణవేణిని "కృష్ణా! బ్రేక్‌ఫాస్ట్ అవలేదా" అనడిగాడు.

"చేయలేదు. నాకు టైంలేదు. బైటనుంచి తెచ్చుకోండి. లేదంటే బ్రెడ్డు తెచ్చుకుని టోస్ట్ చేసుకు తినండి" నిర్లక్ష్యంగా చెప్పి చీర మార్చుకోవడానికి తలుపు వేసేసింది.

ఆ తరవాత చాలా రభస జరిగినా తనకేం సంబంధం లేనట్టు వెళ్లి పోయింది.

సాయంకాలం ఇంటికి వెళ్లేటప్పటికి అందరూ ఎడమొహం, పెడమొహంగా కనిపించినా పట్టించుకోలేదు. ఆ రాత్రి గోపాల్‌తో అంది, "మీ ఇంట్లో కోడల్ని పనిమనిషిగా భావిస్తారని నాకు ముందే ఎందుకు చెప్పలేదు?"

"ఏమైంది? ఎవరేమన్నారు? ఊరడిస్తున్నట్టుగా అడిగాడు.

"ఇవాళ టిఫిను చేయనందుకు నన్నో శత్రువులా చూస్తున్నారు. వాళ్లు చేసుకోవచ్చుగా కావాలంటే."

"అలా ఎందుకు అనుకుంటావు. నీకు చాలా ఇంపార్టెన్స్ ఇచ్చారని, అందరూ నీమీదే ఆధారపడి ఉన్నారని ఎందుకు అనుకోకూడదు? నీకు కొత్త కావచ్చు కానీ, ప్రతి ఇంట్లో మామూలే కృష్ణా!"

"మామూలేనా? ఏంటి మామూలు. కోడలు అనగానే వంటచేసి, అందరికి సేవలు చేసే ఓ పనిమనిషిగా భావించడమా? నీకు నా సంగతి తెలుసు. నా భావాలు, ఆలోచనలు తెలుసు. నాలో ఉన్న ఇండివిడ్యువాలిటీ తెలిసి కూడా ఇలాంటి వాతావరణం మీ ఇంట్లో ఉంటుందని, దాన్ని నేను ఫేస్ చేయాల్సి వస్తుందని నాకు ముందే చెప్పాలి కదా! ప్రేమించి పెద్దల్ని ఒప్పించి పెళ్లి చేసుకుంటే చాలనుకున్నావా?"

"అదికాదు కృష్ణా! ఇది చెప్పేదేంటి? ఆడదానికి నిజానికి నాకన్నా నీకే ఎక్కువగా తెలియాలి ఇలాంటి విషయాలు. ప్రతి ఆడపిల్ల అత్తగారింట్లో పనిచేయా ల్సిందే కదా! నువ్వు మినహాయింపు అవుతావని ఎలా ఎక్స్‌పెక్ట్ చేశావు?"

కృష్ణవేణి ఆశ్చర్యంగా చూసింది. అవును నిజమే తను కేవలం గోపాల్ గురించే ఆలోచించింది. వాళ్ల కుటుంబ విషయాల గురించి, వాళ్ల మనస్తత్వాల గురించి ఆలోచించాలని, తెలుసుకోవాలని తనకి తోచలేదు. పెళ్లంటే తను ప్రేమించిన వ్యక్తితో ఆనందంగా, హాయిగా కలిసి బతకడమే అనుకుంది. పెళ్లి వెనకాల కొన్ని బాధ్యతలు అదనంగా వస్తాయని, పెళ్లితో తనకున్న స్వేచ్ఛ హరించి పోతుందని తనేనాడూ ఊహించలేదు... నిజమే తనదే తప్పు... కానీ, ఆ తప్పుకి పరిహారంగా ఇప్పుడు ఈ ఇంట్లో ఉన్న ఆడపడుచుకి, మావగారికి, అత్తగారికి, భర్తకీ వేళకి టిఫిన్లు, కాఫీలు, వంట చేసి వాళ్ల మెప్పు పొందాలా? నో, అలా జరగదు. ఓ నిర్ణయానికి వచ్చేసింది. టిఫిన్ చేయడం పూర్తిగా మానేసింది. కొన్నాళ్లు దెప్పుళ్లు, మరికొన్నాళ్లు మౌనపోరాటాలు జరిగాయి. కానీ, ఇంట్లోకి కార్న్‌ఫ్లాక్స్, ఓట్స్‌లాంటివి తెచ్చి మావగారికి వాటిలో ఉండే మినరల్స్, విటమిన్స్ ఆరోగ్యానికి అవి ఎంత మంచివో చెప్పాక ఇంటిల్లిపాదీ వాటికి అలవాటుపడ్డారు.

ఆ రోజు స్నేహితురాలు అనూరాధ ఫోన్ చేసింది... "ఏంటి కృష్ణా ఎంఫిల్ అప్లై చేశావు కదా! ఎగ్జామ్ రాయలేదేం."

కృష్ణవేణికి షాక్ కొట్టినట్లు అయింది. అవును కదా! ఎంఫిల్ అప్లై చేశాను కదా! ఏమైంది అసలు ఆ విషయమే మర్చిపోయింది. ఇదెలా జరిగింది? ఆమె మెదడు మొద్దు బారింది. పెళ్లంటే ఇదా? అనుకుంది. జీవన ప్రవాహాన్ని ఆపే అడ్డుకట్టలు వైవాహిక జీవితంలో వచ్చే బాధ్యతలు, బాధ్యతలు లేని వైవాహిక జీవితం ఉండదా?

ఆరోజు గోపాల్‌తో దెబ్బలాడింది. నేను మర్చిపోతే నువ్వైనా గుర్తుచేయవా? నీకన్నా ఎక్కువ చదివేస్తే ఎలా అని అవాయిడ్ చేశావా?" అంటూ తిట్టింది.

గోపాల్ ముందు నచ్చచెప్పడానికి ప్రయత్నించాడు. తరవాత అతనిలో కూడా ఆవేశం పెరిగింది. ఫలితంగా వాగ్వివాదాల మధ్య మనస్పర్థలు ఏర్పడ్డాయి. చిలికి, చిలికి గాలివానగా మారింది. కారణం చిన్నదే అయినా పెద్ద అఘాతం ఏర్పరచింది వాళ్లిద్దరి మధ్యా.

దాంపత్య జీవితంలో అనురాగాల స్థానంలో అపార్థాలు, ప్రేమ స్థానంలో ద్వేషం ఏర్పడ్డాక లోకం కోసమో, పిల్లల కోసమో తప్పనిసరి పరిస్థితుల్లో రాజీపడి నట్టు నటిస్తూ జీవితాంతం బతకడం అనేది కొందరే చేయగలరు. కాకపోతే కృష్ణవేణి ఆ కొందరి జాబితాలోకి రాలేదు. పుట్టింట్లో ఆడింది ఆట, పాడింది పాటగా జరిగింది. ఆమె స్వేచ్ఛకి ఎవరూ అడ్డు చెప్పేవారు కాదు. ఇక్కడ మాత్రం గడపదాటాలంటే అత్తగారి పర్మిషన్, మావగారి పర్మిషన్ తప్పనిసరి. ఆఫీసు నుంచి గంట ఆలస్యం అయితే ఎక్కడికెళ్లావు? ఆలస్యం ఎందుకైంది? అంటూ ప్రశ్నలు, జవాబులు సంతృప్తిగా లేకపోతే గోపాల్‌కి ఫిర్యాదులు. ఈ ఇంట్లో ఉండలేను బాబోయ్ నా వల్లకాదు. అనుకుంటూనే ఏడాది గడిచింది.

ఆరోనెల గర్భవతి అని తెలియగానే "మాకు మనవడు కావాలమ్మాయ్! ఆడపిల్లలను కంటే ఊరుకునేది లేదు" అంటూ అత్తగారు, మావగార్ల వార్నింగులు. రోజురోజుకీ కృష్ణవేణికి మతిపోసాగింది. ఈ ప్రపంచంలో ఇలాంటి మనుషులుం టారా? ఆశ్చర్యంగా అడిగింది తల్లినోసారి. ఆవిడ నవ్వింది. "ఇలాంటి వాళ్లే ఉంటారు. మనింట్లోలాగా అందరూ ఉంటారని ఎలా అనుకుంటావు కృష్ణా! తప్పదు, సర్దుకుపోవాలి... అంతే! ఇది జీవితం...నీలాగే నేనూ పుట్టింట్లో గారా బంగా పెరిగాను. కానీ, ఏం లాభం? కాపురానికి వస్తూనే మడికట్టుకుని వంటలు, వడ్డనలు, పొద్దున్నే గేదెల పని, సాయంత్రం వంట... నాకు నలుగురు ఆడబడు చులు, ముగ్గురు మరుదులు... మీ నాన్నగారే పెద్దవారు. అత్తగారు, ఆవిడ అత్తగారు, మావగారు... ఇంతదాకా నా జీవితం సాగింది కదా..." అంది ఊరడిస్తూ.

"ఓగాడ్... నా వల్లకాదమ్మా... అలా వంటగదిలో, ఓ పొయ్యిలాగో, రాగిబిందెలాగో నేనుండలేను. నా జీవితం స్థంభించినట్టుందమ్మా... ఎలా మర్చిపోయానో నాకే అర్థం కావడంలేదు. ఎంఫిల్ అప్లై చేసి వదిలేశాను. ఎలాగైనా ఈ ఏడాది మళ్లీ ప్రయత్నిస్తాను."

"ఇంకేం చేస్తావు... పసిపిల్లతో ఇటు ఇంట్లో పని, అటు చదువు, ఉద్యోగం అన్నీ కుదురుతాయా? మర్చిపో ఎం.ఫిల్ సంగతి..."

'వాట్?' ఆశ్చర్యంగా చూసింది. 'మర్చిపోనా... ఎంత ఈజీగా అన్నావమ్మా'

బాధగా అంది.

"తప్పదు కృష్ణా! ఒకటి కావాలంటే మరొకటి వదులుకోవాలి."

"అయితే ఈ కాపురం వదులుకుంటానమ్మా"

"ఏం తమాషాగా ఉందా? చదువు కోసం నూరేళ్ల కాపురం వదులుకుంటావా? అలాంటి పని చేయకు పరువుపోతుంది. మన ఇంటా, వంటా అంతా సర్దుకుపోయి బతికినవాళ్లే. ఏదో ఒక్కతే కూతురువని గారాబంగా పెంచాం. అంతేగానీ, నువ్వు ఏంచేస్తే అది కరెక్ట్ అంటాననుకోకు" అంటూ కోపంగా చాలాసేపు క్లాస్ తీసుకుంది తల్లి.

కృష్ణవేణికి అర్థమైపోయింది. తనకి సపోర్టుగా ఉండేవాళ్లు ఎవరూ లేరు. గోపాల్ కూడా చదువు సంగతి ఎత్తితే మాట మారుస్తున్నాడు. పుట్టబోయే పిల్లాడి గురించి మాట్లాడుతున్నాడు. కాకపోతే పిల్లాడే కావాలని వాళ్లమ్మా, నాన్నలాగా పట్టుపట్టడంలేదు. కూతురైనా ఓకె అంటున్నాడు.

కృష్ణవేణికి డెలివరీ అయింది. పాప పుట్టింది. అత్తగారు, మావగారు పెద్ద రభస చేశారు. గోపాల్ ఈ విషయంలో వాళ్లతో ఘర్షణపడ్డాడు. నాకు లక్ష్మి పుట్టింది. ఈ రోజుల్లో ఎవరైనా ఒకటే అంటూ వాళ్ల నోరు మూయించాడు.

కృష్ణవేణి పాపాయి పనుల్లో పడి తాత్కాలికంగా తన మానసిక సంఘర్షణను మర్చిపోయింది. పాపకి మూడేళ్లు వచ్చాయి. కృష్ణవేణి జీవితంలో ఎదుగుదల లేదు. ఉద్యోగంలో అంతకన్నా లేదు. అనుకుంటూనే నాలుగేళ్లు గడిచిపోయాయి. ఎంఫిల్ లేదు... పిహెచ్‌డి అసలేలేదు. ఎదుగూబొదుగూ లేని జీవితం అయిపోయింది. ఆమెలో అణగారిన అసంతృప్తి జ్వాలలు తిరిగి రగుల్కొన్నాయి. భర్తతో మనసారా మాట్లాడుకోవడానికి కూడా ఆ ఇంట్లో ప్రైవసీ ఉండదు. రాత్రి పూట పడుకున్నప్పుడే అలసిపోయి మంచం మీద వాలగానే ఆకలిగా ఆక్రమించుకునే వాడితో భవిష్యత్తు ఏం చర్చించగలదు.

హఠాత్తుగా గుర్తొచ్చింది తాను రచయిత్రిగా కూడా చచ్చిపోయిందని కృష్ణవేణికి. ఉప్పెనలా దుఃఖం ముంచుకొచ్చింది. తనని హత్తుకుని పడుకుని గుర్రుపెడుతున్న గోపాల్‌ని మెల్లిగా తప్పించి లేచి టేబిల్ దగ్గరకి నడిచింది. ఇంట్లో ఒక పేపర్ కూడా దొరకలేదు. తనదొక పాతడైరీ ఖాళీగా ఉంది. అది తీసుకుని, టేబిల్ లైట్ ఆన్ చేసి నెమ్మదిగా తన మనసులో భావాలను అక్షరాలుగా మార్చసాగింది. కాస్సేపటికి చిన్నచిన్న జల్లుల్లా సాగిన ఆమె రచన ఓ ప్రవాహంలా మారడానికి ఎక్కువ సమయం పట్టలేదు.

కృష్ణవేణి నవల ఒక ప్రముఖ వారపత్రికలో సీరియల్‌గా ప్రారంభమైంది. అందులోని పాత్రలు అత్తగారు, ఆడపడుచులు, మావగారు, వ్యక్తిత్వం లేని భర్త. ఆమె తను కోల్పోతున్న ఆనందాలను, దానికి కారణాలను విపులంగా చర్చించ డంతో పాత్రలన్నీ కుటుంబసభ్యులకి దగ్గర పోలికలు ఉండడంతో అందరూ ఒక్కసారిగా ఆమె మీద విరుచుకుపడ్డారు. "ఇంటిగుట్టు రచ్చకీడ్చి కీర్తి, సానుభూతి పొందాలనుకుంటున్నావా? ఏం వేరే సబ్జెక్ట్ దొరకలేదా నీకు రాయడానికి?" అంటూ గోపాల్ కూడా ఇష్టం వచ్చినట్టు మాట్లాడడం, సీరియల్ ఆపేయమని కోర్టుకి వెడతాననడం కృష్ణవేణి జీవితంలో దుమారం రేగింది. ప్రయత్నంగానో, అప్రయత్నంగానో తానొక సంచలనానికి తెరదీసింది. నిజానికి తనకీ తెలుసు ఒక వరవడిలో రాసుకుపోయిన ఆ నవల తన జీవితానికి చాలా దగ్గరగా ఉందని... అందులోని పాత్రలన్నీ తన చుట్టూ తిరుగుతున్నవే అని... కానీ, అందుకు ఆమె సంజాయిషీ ఇచ్చుకోడానికిగానీ, క్షమార్పణ అడగడానికిగానీ సిద్ధపడలేదు. కుటుంబంలో ఎలా ఉన్నా పాఠకలోకంలో కృష్ణవేణికి చాలా పేరొచ్చింది. అభిమా నులు అనంతంగా పెరిగిపోయారు. సీరియల్ సశేషం తరవాత బోలెడన్ని లెటర్స్ కూడా పబ్లిష్ అవుతున్నాయి. వాటిలో అలాంటి అత్తమామలతో అంతకాలం కలిసి ఉన్న హీరోయిన్ మీద మహిళా పాఠకులు బోలెడంత సానుభూతి చూపిం చారు.

కృష్ణవేణి ఆగలేదు. ఆమెకి తన గమ్యం ఏవిటో అర్థమైపోయింది. గోపాల్‌తో జరిగిన వాగ్వివాదం విడిపోయిందాకా తీసుకొచ్చింది. కూతుర్ని తీసుకుని బైటకు నడిచింది.

కాలింగ్ బెల్ మోగడంతో కృష్ణవేణి ఆలోచనల్లోంచి బైటపడింది. కన్నీళ్లతో తడిసిన జాకెట్టు చల్లగా తగిలింది. పైటచెంగుతో కళ్లు తుడుచుకుంది. లేచి వెళ్లి తలుపు తీసింది. పనిమనిషి లోపలికి వచ్చింది. చిరునవ్వు నవ్వి లోపలకు వెళ్లి పోయింది. ఆ పిల్లకి ఏమీ చెప్పనవసరంలేదు. ఏ టైంలో ఏం పనిచేయాలో తనే చేస్తుంది. ఇవాళ కృష్ణవేణికి అంతులేని కీర్తి ఉంది... తనదీ అనే ఆస్తి ఉంది. సొంత ఇల్లుంది. కారుంది. సమాజంలో స్టేటస్ ఉంది. కానీ, నా అని చెప్పుకోడా నికి ఎవరూ లేరు. ఇంతకాలం కూతురు మీద తనకి సర్వహక్కులున్నాయను కుంది. కానీ...కానీ.. కృష్ణవేణి నీళ్లు నిండిన కళ్లతో టీపాయ్ మీద ఉన్న కాగితాల వైపు చూసింది.

లాలిత్య రెండు చేతుల్తో ఆ కాగితాలు పట్టుకుని తన కళ్లముందు రెపరెప లాడిస్తూ కొంటెగా నవ్వినట్టు అనిపించింది.

కృష్ణవేణిది చాలా బిజీ లైఫ్ ఆమె తనజీవితాన్ని అలా మలచుకుంది. రచయిత్రిగా ఒక స్థానం అంటూ కలిగాక, పైగా అనుకోకుండా పడిన స్త్రీవాద రచయిత్రి అన్న బ్రాండ్ నుంచి ఆమె బైటికి రావడానికి ఇష్టపడలేదు. మామూలు రచయిత్రిగాకన్నా స్త్రీవాద రచయిత్రిగా ఆమెకో ప్రత్యేక గుర్తింపు లభించింది. ఎక్కడ ఏ సభ జరిగినా కృష్ణవేణి ఒక అతిథిగానో, స్పీకర్‌గానో తప్పనిసరిగా వెళ్లాల్సి వస్తోంది. అలా నేషనల్ లెవెల్ దాకా ఆమె పేరు ప్రతిష్టలు ఎగబాకాయి. కీర్తి, డబ్బు సంపాదించిన కొద్దీ ఇంకా, ఇంకా కావాలనిపిస్తుంది. దానికి అంతం అనేది ఉండదు. కృష్ణవేణికి్కూడా అలాగే ఉంది. గోపాల్ నుంచి రెండు, మూడు సార్లు రాయబారం వచ్చింది. జరిగిందేదో జరిగింది. కలిసి బతుకుదాం రమ్మని. కానీ, మళ్లీ కుటుంబం అనే చట్రంలోకి వెళితే తన వ్యక్తిత్వం, తన స్వేచ్ఛ, తన కీర్తికి భంగం కలుగుతుందనిపించింది. అలాంటప్పుడు కేవలం ఒక గృహిణిగా బతకడంలో ఆమెకి ఎలాంటి ఆసక్తి కలగలేదు. కేవలం భర్తతో లభించే శారీరక సుఖం కోసమే కుటుంబ జీవనం గడపాలనుకుంటే ఆ పావుగంట కోసం మిగతా అమూల్యమైన కాలాన్ని వంటింట్లో వంటచేయడానికి, అంట్లగిన్నెలు తోమడానికి వెచ్చించడం ఆమెకి ఇష్టంలేదు. అందుకే అతని ఆహ్వానాన్ని నిర్దయగా తిరస్కరించింది.

కృష్ణవేణి నిట్టూర్చింది. లాలిత్య పెళ్లయి కాపురానికి వెళ్లాక ఒక్కసారి కూడా తల్లి దగ్గరకు రాలేదు. కృష్ణవేణి ఒక్కసారి వెళ్లి కూతురు ధోరణికి చికాకేసి వచ్చేసింది. అది పక్కా ఇల్లాలైంది. ఎలా బతుకుతుందో అనుకుంది. అలా రెండేళ్లు గడిచాయి. లాలిత్య నెల తప్పిందని వాళ్లత్తగారు ఉత్తరం రాసింది కృష్ణవేణికి. ఆ వార్త కృష్ణవేణికి ఆనందం కలిగించలేదు. లాలిత్య సంసారం అనే ఊబిలో కూరుకుపోతున్నట్టు అనిపించింది. పైగా "పురుటికి ఏడోనెల్లోనే మీరు తీసికెళ్లాలి... బెంగుళూరు వచ్చి సీమంతం చేసి తీసికెళ్లండి" అంటూ ఆవిడ రాసిన ఉత్తరం చూస్తే మండిపోయింది కృష్ణవేణికి. ఈవిడెవరు తనకి ఆర్డర్ ఇవ్వడానికి అనుకుంది. వెంటనే "తొమ్మిదో నెల్లో వస్తాను... వచ్చి తీసికెడతాను. నేను బిజీగా ఉన్నాను" అంటూ ప్రత్యుత్తరం రాస్తూ లాలిత్యకి ఆరోగ్యం జాగ్రత్తగా చూసుకోమని, ఇంటిల్లిపాదికి సేవలు చేస్తూ కూర్చోకుండా గర్భిణీ స్త్రీలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు అన్నీ నెట్‌లో చదువుకుంటూ గడపమని రాసింది.

లాలిత్యకి తొమ్మిదో నెల వస్తూనే కృష్ణవేణి వెళ్లడానికి ప్రయాణం ఏర్పాట్లు చేసుకునేలోగానే లాలిత్యకి డెలివరీ అయి పాపాయి పుట్టిందని ఫోన్ చేసింది. పాపని చూడడానికి వెళ్లి, పదకొండో రోజు నీళ్లు పోసి నెల లోపల పుట్టింటికి

తీసుకురావాలనుంది కానీ, లాలిత్య "నేను రాను మమ్మీ! పాపను చూడకుండా శశి ఉండలేడు. తర్వాత వస్తాలే" అంటూ తిరస్కరించింది.

పాపకి ఏడాది దాటుతోంది. అయినా రాలేదు. కృష్ణవేణి కూడా మీటింగ్ లని, సెమినార్‌లని, వర్క్‌షాప్‌లని తిరగడంతో సరేలే ఎక్కడో అక్కడ హేపీగా ఉందికదా అనుకుంది కానీ, లాలిత్యకి సీమంతం చేయకపోవడం తన నేరంగా భావిస్తున్నారనిగానీ, మొదటిసారి గర్భంతో వున్న కూతురికి చేయాల్సిన ముచ్చట లేవీ చేయలేని తల్లి ఒక తల్లా అని తనని అందరూ విమర్శిస్తున్నారని వగైరా విషయాలు ఏమీ తెలియలేదు. తెలుసుకునే ప్రయత్నం చేయలేదు. అయితే ఇటీవల సింగపూర్‌లో జరిగిన తెలుగు మహాసభలకు వెళ్లి వచ్చాక కృష్ణవేణి ఆరోగ్యంలో చిన్న మార్పు వచ్చింది. మోకాళ్లు నొప్పి, నడుం నొప్పి అంటూ డాక్టర్ దగ్గరకెళితే ఖచ్చితంగా నెలరోజులు బెడ్ రెస్ట్ తీసుకోవాలని, డిస్క్ ప్రొలాప్స్ అయిందని చెప్పాడు.

చాలాకాలం తరవాత మంచం కదలకుండా ఇంట్లోనే ఉన్న కృష్ణవేణికి ఒక్కసారి కూతుర్ని, మనవరాలిని చూడాలనిపించింది. వెంటనే లాలిత్యను రమ్మని ఉత్తరం రాసింది. తనకిలా అనారోగ్యంగా ఉందని, బెడ్ రెస్ట్‌లో ఉన్నానని, నాలుగు రోజులు ఉండేలా రమ్మని రాసిన ఉత్తరానికి లాలిత్య నుంచి వచ్చిన జవాబు ఆమెని నిర్ఘాంతపోయేలా చేసింది. నా కూతురు ఇంత ఎదిగిందా? అనిపించింది. కృష్ణవేణి వణుకుతున్న చేతుల్తో మరోసారి ఉత్తరం అందుకుంది.

"అమ్మా నీ ఉత్తరం చేరింది. నీకు ఆనారోగ్యంగా ఉందని, డాక్టర్ బెడ్‌రెస్ట్ తీసుకోమన్నారని రాశావు. ఇప్పుడెలా ఉంది? పనిమనిషి కుమారి రెగ్యులర్‌గా వస్తోందనుకుంటాను. తను నిన్ను బాగానే చూసుకుంటుందని నా నమ్మకం. నేనిప్పుడు రావాలంటే చాలాకష్టం. శశికి ప్రమోషన్ వచ్చింది. బాధ్యతలు పెరి గాయి. అత్తయ్యగారి ఆరోగ్యం కూడా బాగాలేదు. ఆవిడ ఇప్పుడు ఇక్కడే ఉన్నారు. ఆమె పాపని చూసుకుంటున్నారు. నేను వాళ్లందరి బాధ్యతా తీసుకున్నాను. నీకిది వింతగా అనిపించవచ్చు. కానీ... నాకు చాలా సహజంగా అనిపిస్తోంది. ఆడపిల్ల పెళ్లి అయాక అత్తగారి వాళ్లకే సొంతం అవుతుంది. ఇది సమాజ ధర్మం. ఈ ధర్మాన్ని నేను కాదనలేదు. ఎందుకంటే నేను నా ధర్మానికి వ్యతిరేకంగా ప్రవర్తిస్తే నీలాగే సంసార జీవితానికి దూరం కావాల్సివస్తుంది. ఒకసారి భర్తతో మనస్పర్థ లంటూ ఏర్పడ్డాక తిరిగి కలవడం జరగదు. అప్పుడు నిన్ను వెలేసినట్టే నన్నూ నా వాళ్లంతా వెలేస్తారు. నా కూతురికి తండ్రి ప్రేమని దూరం చేయడం నాకు ఇష్టంలేదు. ఎందుకంటే తండ్రి ప్రేమ పొందని ఆడపిల్ల మనసేంటో నాకు తెలుసు.

తండ్రి సంరక్షణ లేని ఆడపిల్ల జీవితం ఎలా ఉంటుందో నాకు తెలుసు. బంధువులు, మిత్రులు వస్తూ పోతూ ఉండే ఇళ్లల్లో ఉండే చైతన్యం, మనింట్లో నాకెప్పుడూ కనిపించలేదు. ప్రతి దీపావళికి ఎదురింటి వాళ్లు దీపాలు వెలిగించి, అందరూ కలిపి టపాకాయలు కాలుస్తుంటే, వంటరిగా నేను చిచ్చుబుడ్డి వెలుగుల్లో నా భవిష్యత్తుని వెతుక్కున్న రోజులు నాకు బాగా గుర్తు. అందుకే నా పిల్లలకి అమ్మా, నాన్నా, మామ్మా, తాతయ్యా, అమ్మమ్మ, తాతయ్యా అందరూ కావాలని నా కోరిక.

అమ్మా! శశికి నేనంటే ప్రాణం... నాకూ శశి అంటే ఇష్టం. అలా అని నిన్ను వదిలి శశినే లోకంగా బతకాలని నేనెన్నడూ అనుకోలేదు. కానీ నువ్వే నేను ఎంత దగ్గరగా అవాలనుకునేదాన్నో డిసిప్లిన్ అంటూ నన్ను అంత దూరంగా పెట్టావు. గారాబంగా పెంచుకోవడం వేరు... ప్రేమతో పెంచుకోవడం వేరు. నేను ఏం కోల్పోతున్నానో నాకు అందించడానికి నువ్వేం ప్రయత్నించలేదు. అలా చేసి ఉంటే నాన్నని వదిలి వచ్చేముందే నా గురించి ఒక్కక్షణం ఆలోచించి ఉండేదానివి. అమ్మా! సహజీవనం అంటే ప్రేమానురాగాలు పంచుకుంటూ, ఒకరి అభిప్రాయాలు ఒకరు గౌరవించుకుంటూ, వ్యక్తిత్వాన్ని కాపాడుతూ, కాపాడు కుంటూ బతకడం అని నా అభిప్రాయం. నాకు కుటుంబం కావాలి. పెద్ద కుటుంబం కావాలి. నువ్వు... నేను... నీ బిజీలో నువ్వు. నా హోంవర్క్‌లు, పరీక్షల ప్రిపరేషన్స్‌లో నేను... మనకెవరున్నారు? ఎప్పుడన్నా అమ్మమ్మగానీ, తాతయ్యగానీ, నానమ్మగానీ, మేనత్తలుగానీ మనింటికి వచ్చారా? నాకోసం ఏదన్నా తెచ్చారా? మనింట్లో సందడి అనేది వినబడిందా? లేదు... నాకు తెలిసి ఎన్నడూ లేదు.

నీకు నీ పేరు ప్రతిష్టల మీద, నీ మీటింగ్‌ల మీద, నీ రచనల మీద, అభిమానుల మీద ఉన్న ఆసక్తిలో కొంచెం నామీద ఉండి ఉంటే నా జీవితం బహుశా ఇంకోలా ఉండేదేమో. నీ ఆదర్శాలకిచ్చిన విలువ నా ఆశలకివ్వలేక పోయావు. నీ బిజీ లైఫ్‌లో నన్ను ఒంటరిని చేశావు. ఆదర్శం ఏమిటో నాకెప్పటికీ అర్థంకాదు. నువ్వు నమ్మిన సిద్ధాంతం నీకు ఆదర్శం అయితే, నేను నమ్మిన సిద్ధాంతం నాకు ఆదర్శమే కదా... నాకు ఆదర్శగృహిణిగా ఉండడం ఇష్టం. అలా అని శశి నన్ను అలా మార్చుకున్నాడని అనుకోకు. తనే మందలిస్తుంటాడు. 'ప్రతి దానికీ డిపెండెంట్‌గా ఉండకు. నీ ఇండివిడ్యువాలిటీ నీకుండాలి' అని. కానీ, నాకెందుకో ఏం కావాలన్నా శశి ద్వారా పొందడమే ఇష్టం.

నేను మొదటిసారిగా గర్భం దాల్చినప్పుడు ప్రేమగా నన్ను నీ దగ్గరకు

తీసికెళ్లి పెడితే కడుపు చలవ అంటారు. అలా చేశావా? లేదు. నీకు టైంలేదు. డెలివరీ అయాక పాపని చూసుకోడానికి కొంతకాలం నా దగ్గర ఉన్నావా? లేదు... నీకు టైంలేదు.

నీకిప్పుడు వయసు అయిపోయింది. సహజంగా ఏర్పడే కొన్ని అనారోగ్య లక్షణాలు నీలో ఏర్పడ్డాయి. నీవిప్పుడు తప్పనిసరిగా విశ్రాంతి తీసుకోవాల్సి వచ్చింది. ఈ విశ్రాంతిలో, ఈ ఖాళీలో నీకు నేను గుర్తొచ్చాను. ఏం ఇంతకాలం నిన్ను ఉక్కిరి, బిక్కిరి చేసిన నీ వ్యాపకాలు, నీ అభిమానులు, నీ ఇంటర్వ్యూల కోసం పోటీపడే చానెల్స్ వాళ్లు వీళ్లంతా నీకు ఇప్పుడు గుర్తురావడం లేదా? వాళ్లెవరూ నీకేమీ సాయం చేయలేరా? లేదు చేయరు. ఎందుకంటే వాళ్లు నీకేమీ కారు. ఏదో ఉద్యోగ ధర్మంగా నిన్ను ఎంటర్‌టైన్ చేశారు. వాళ్లు నీ రక్తసంబంధీకులు కాదు. నీ బంధువులు కాదు. నీతో జీవితం పంచుకున్న వాళ్లు కాదు. జాతీయ స్థాయిలో కీర్తిని సంపాదించుకున్నావే... ఆ కీర్తి నీకిప్పుడు ఒక్క ఆత్మీయులని అందివ్వగలదా?

సారీ అమ్మా! నేను నీ పెంపకంలో చాలా కోల్పోయాను. సాధారణంగా ప్రతి వ్యక్తీ కూడా తానేం కోల్పోయాడో దానికోసం అన్వేషిస్తాడు. నాకు బోలెడంత స్వేచ్ఛ ఇచ్చావు. నాకు ప్రతి పనీ నేను చేసుకుని విసుగొచ్చింది. నా పనులు ఎవరన్నా చేసిపెడితే బాగుండు... నాకేం కావాలో ఎవరన్నా అమరిస్తే బాగుండు అనిపించింది. అన్నీ శశి సహచర్యంలో తీరుతున్నాయి. అలా అని నువ్వనుకు న్నట్టు నేను బానిసను కాను. ఇంట్లో ఏం చేయాలన్నా నా అంగీకారం ఉంటే తప్ప శశి చేయడు. అత్తగారికి నేనంటే విపరీతమైన నమ్మకం. మావయ్యగారికి చాలా అభిమానం. నాన్నా! ఆయన స్నేహితుల్లా ఉంటారు. ఎవరూ కూడా నిన్ను ద్వేషించడంలేదు. ఇది చాలా ఇంపార్టెంట్ విషయం. నువ్వు తెలుసుకోవాల్సిన విషయం, మనిషి సామాజిక జంతువు అంటారు. దాని అర్థం నాకు తెలిసింది. ఏంటంటే సమాజంలో ఒకడుగా, సమాజ ధర్మాన్ని అనుసరిస్తూ సాగిపోవడమే మనిషి బాధ్యత అని నేను అనుకుంటున్నాను. మరి ఒక ఫెమినిస్టుగా నీ ఆలోచన ఏమిటో నాకు తెలియదు.

నాకు ఒంటరితనం అంటే భయం. అసహ్యం కూడా. క్రమశిక్షణ పేరుతో నన్ను ఆమడదూరంలో ఉంచావేకానీ, ఏనాడూ దగ్గరకు తీసుకుని నన్ను నీ గుండెలకు హత్తుకోలేదు. మనమధ్య నాకు ఒక వయసు వచ్చిన దగ్గర్నించీ ఏదో తెలియని దూరం ఏర్పడింది. ఆ దూరం తగ్గించే ప్రయత్నం నువ్వేం చేయలేదు. నాకు నా ఇల్లు వచ్చేపోయే అతిథులతో కళకళ్లాడాలి. నిత్యకళ్యాణం పచ్చతోరణం

లా ఉండాలి. నాకు తెలిసీ మనింటికి ఎవరూ ఎప్పుడూ వచ్చి ఒకపూట ఉన్నట్టుగా లేదు.

అమ్మా! జీవితంలో మనకేం కావాలో పోరాడితే లభించదు... జీవితానందం కోల్పోవడం తప్ప ఫలితం ఉండదు. రాజకీయంలో పోరాడితే తప్ప ఏదీ లభించదు. జీవితం రాజకీయం కాదు. నేనిప్పుడు చాలా ఆనందంగా ఉన్నాను. ఒకవేళ నువ్వనుకున్నట్టు ఎప్పుడన్నా ఒంటరిగా ఈ జీవితాన్ని ఎదుర్కోవాల్సిన స్థితి వస్తే ఎలా ఎదుర్కోవాలో కూడా నాకు తెలుసు. అమ్మా! నీ ముందు ఇప్పుడు మూడు మార్గాలున్నాయి. నాన్న నిన్ను ద్వేషించడంలేదు. ఈ వయసులో నీకు తన అవసరం, తనకి నీ అవసరం చాలా ఉందని ఆయనకి తెలుసు. అలాగే నాకూ నీ ప్రేమాభిమానాలు కావాలి. నా పిల్లలకి అమ్మమ్మ అనురాగం కావాలి. కాబట్టి నా ఇంటి తలుపులు కూడా నీకోసం సదా తెరిచే ఉంటాయి. ఇకపోతే నువ్వెంచు కున్న గమ్యం... నీ సాహితీ లోకం... నీ అభిమానులు... నీ కీర్తి ప్రతిష్టలు... మాతో ఉన్నా వాటికెక్కడా భంగం కలగదు. ఈ మూడు మార్గాల్లో నీకిప్పుడు ఏమార్గం సుగమమో, ఎక్కడ నువ్వు నిశ్చింతగా, హాయిగా ఉంటావో నిర్ణయించు కునే హక్కు నీదే. నువ్వెటు నడచినా నీకో గమ్యం మాత్రం ఏర్పరచుకో. అదే కోరేది. ఉంటాను"

లాలిత్య

కృష్ణవేణి వెక్కివెక్కి ఏడవసాగింది. పని పూర్తి చేసుకుని చీరచెంగుతో చేతులు తుడుచుకుంటూ వచ్చిన కుమారి ఆవిడ ఏడుపు చూసి నిశ్చేష్టురాలైంది.

"అమ్మగారూ ఏమైంది? నెప్పి ఎక్కువగా ఉందా?" ఆప్యాయంగా అడిగింది.

కృష్ణవేణి మాట్లాడలేదు. చాలాసేపు అలా ఏడుస్తూనే ఉండిపోయింది. కుమారికెలా ఓదార్చాలో అర్థంకాలేదు. ఎప్పుడూ గంభీరంగా చూపుల్తోటే ఆమడ దూరంలో నిలబెట్టే అమ్మగారంటే భయం. అందుకే ఏం మాట్లాడాలో అర్థంకాక నిరుత్తరాలిగా నిలబడి పోయింది. కృష్ణవేణి కళ్లు తుడుచుకుని కొంచెం వెక్కుతూ "కుమారీ! ఈ ఒక్కరాత్రి నా దగ్గర ఉండగలవా?" అడిగింది.

"నేనా? ఇక్కడా..." నీళ్లు నములుతూ అంది కుమారి. "ఇంటి దగ్గర పిల్లలున్నారమ్మా... వెళ్లి వంటచేసి వాళ్లకి అన్నం పెట్టాలి. మా ఆయన కూలీ నుంచి వస్తాడు. వేడిగా అన్నం వండితేనే తింటాడు. నాకు కుదరదమ్మా..."

చెంపమీద చెళ్లుమని కొట్టినట్టు అనిపించింది కృష్ణవేణికి. "సరే వెళ్లు" అంటూ మొహం తిప్పుకుంది.

కుమారి నెమ్మదిగా అక్కడినుంచి కదిలి బైటకి వెళ్లిపోయింది.

వెల్లకిలా మంచం మీద వాలిన కృష్ణవేణి కళ్లకి పైన గిరగిరా తిరుగుతోన్న సీలింగ్ ఫ్యాన్ తప్ప మరేం కనిపించలేదు. కళ్లు నీటికుండల్లా మారాయి. షెల్ఫ్‌లో ఉన్న లాలిత్య చిన్ననాటి ఫొటో వెక్కిరిస్తున్నట్టు అనిపించింది.

***

*(28 మార్చి 2010, ఆదివారం ఆంధ్రప్రభ)*